క్లుప్తంగా

కరాటే పోటీలలో పతకాలు



కరాటే పోటీల్లో బంగారు పతకాలు సాధించిన చిన్నారులు

రాజమహేంద్రవరం రూరల్: ఫోర్త్ ఇంటర్ స్టేట్ గుజూరియో ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో కవలగొయ్యి గ్రామానికి చెందిన ఏడుగురు చిన్నారులు బంగారు పతకాలు సాధించారు. ఈ విషయాన్ని కోచ్ పంచికట్ల శ్రీనివాస్ ఆదివారం విలేకరులకు తెలిపారు. భవిష్యత్తులో చిన్నారులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

పేదలకు దుస్తుల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి, పుష్కరాల రేవులో ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ తుపానులు, ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు నిరాశ్రయులకు తమ సంస్థ ద్వారా దుస్తులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకూ ఐదు లక్షల జతల దుస్తులు అందజేసినట్టు వెల్లడించారు. ఆనందాల గోడ (వాల్ ఆఫ్ హ్యాపీనెస్) అనే కార్యక్రమం ద్వారా 2016 నుంచి విశాఖ, తూర్పుగోదావరి, మన్యం ప్రాంతాలలో అవసరార్థులను గుర్తించి దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. వాటిని సమకూర్చుతున్న దాతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. నగర ప్రజలు తమ వద్ద అదనంగా ఉన్న దుస్తులను శుభ్రపరిచి, ఇస్త్రీ చేసి లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమానికి అందించాలని కోరారు. వాటిని పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు.

బీజేపీ రూరల్ మండల కమిటీ నియామకం



నూతన కార్యవర్గ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

రాజమహేంద్రవరం రూరల్: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పిలుపునిచ్చారు. పిడింగొయ్యి బుచ్చయ్య నగర్‌లో రూరల్ రెండో మండల కమిటీని అధ్యక్షుడు మట్టా నాగబాబు ఆధ్వర్యంలో ఆదివారం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగేంద్ర మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కాగా.. మండల ఉపాధ్యక్షులుగా మజ్జి సాయికిరణ్, నాసంశెట్టి శ్రీనివాస్, తాడ్డి కోటేశ్వరరావు, ముద్రగడ సూర్య చంద్రమోహన్, కాళ్ల మంగాదేవి, కొమ్మినేని లక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా వడ్డి సూర్యచంద్రబాబు, కర్రి హరికృష్ణ, కార్యదర్శిగా చిచ్చారి గోపాలకృష్ణ, కొయ్యాన సుధాకర్, వార అలేఖ్య, అన్నాబత్తుల సాంబయ్య, కోశాధికారిగా మాదాబత్తుల త్రిమూర్తులును నియమించారు. అలాగే మండల యువ మోర్చా అధ్యక్షుడిగా తాడి బలరాం, ఓబీసీ అధ్యక్షుడిగా పబిలి సతీష్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా కెరా నూకరత్నం నియమితులయ్యారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదివారం తన నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. హుకుంపేట డి బ్లాకు చెందిన ఆత్కూరి నాగ వెంకట సత్య కుమారికి రూ.80 వేలు, వీరవరం గ్రామానికి చెందిన దొంతంశెట్టి సత్తిరాజుకు రూ.37,180లు చొప్పున అందించారు. పిన్నమరెడ్డి ఈశ్వరుడు, బొప్పన నానాజీ, గారపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మధురపూడి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. దురలవాట్లకు బానిసలైతే అనేక అనర్థాలు జరుగుతాయన్నారు. సారా రహిత గ్రామంగా శ్రీరంగపట్నాన్ని తయారు చేయడానికి అందరూ సహకరించాలన్నారు. సీఐ సత్య కిషోర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పనసరిగా డ్రైవింగ్ లైసెన్సులు పొందాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్యామ్ సుందర్, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు చోటెక్కడ!



గోదావరిలో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



కాలువలో నిండిపోయిన చెత్త

- అధ్వానంగా రాజమహేంద్రవరం
- గోదావరి నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు
- చెత్తతో నిండిపోతున్న కాలువలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్వచ్ఛ రాజమహేంద్రవరం, స్వచ్ఛ గోదావరి సాధ్యమయ్యేనా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధి సుమారు 44.5 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. నగరంలోని 50 డివిజన్లను 137 క్లస్టర్లుగా విభజించి, ప్రజల నుంచి చెత్తను సేకరిస్తున్నారు. అయితే నగరపాలక సంస్థలో ఉత్పన్నమయ్యే చెత్త గోదావరిలో పేరుకుపోతోంది.

ప్రకటనలకే పరిమితం

ప్లాస్టిక్ నిషేధాన్ని కచ్చితంగా అమలు చేస్తామంటూ ప్రకటనలు చేస్తున్న నగరపాలక సంస్థ అధికారులు.. క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా పేరుకుపోతున్నాయి. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాల్సిన నగరపాలక సంస్థ సిబ్బంది నిర్లక్ష్యంతో నల్లా చానల్ ద్వారా గోదావరిలో కలిపేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అక్కడ కనిపిస్తున్న వ్యర్థాలే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

పేరుకుపోతున్న వ్యర్థాలు

నల్ల చానల్ ద్వారా వచ్చిన వ్యర్థాలను ఆర్యాపురం వద్ద గోదావరిలో యథాతథంగా కలిపేస్తున్నారు. దీంతో గోదావరి విపరీతంగా పేరుకుపోతున్నాయి. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఒడ్డున అవి నిలిచిపోయాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో గతేడాది నగరానికి 59వ ర్యాంకు మాత్రమే వచ్చింది. ఈసారి మొదటి పది స్థానాల్లో నిలవాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను చూస్తుంటే అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.

అనేక సమస్యలు

త్వరలో నగర పరిశీలనకు రానున్న కేంద్ర బృందానికి నగరంలోని వ్యర్థాలు స్వాగతం పలికే పరిస్థితి నెలకొంది. గోదావరిని పరిశీలిస్తే గతేడాది సాధించిన ర్యాంకు కన్నా మరింత దిగజారిపోయే ప్రమాదం ఉంది. నగర ప్రజలు వ్యర్థాలను డస్ట్‌బిన్లలో వేయకపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో పాడేయడంతో అనేక సమస్యలు వస్తున్నాయి. నిబంధనలను అతిక్రమించే వారిపై చర్యలు చేపట్టాల్సిన నగరపాలక సంస్థ అధికారులు తూతూమంత్రంగా కేసులు నమోదు చేయడం వల్లనే ఈ విధమైన పరిస్థితి ఏర్పడిందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి గోదావరి నది కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని నగర ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యర్థాలను తొలగించాలి



స్వచ్ఛ గోదావరిని సాధిస్తే స్వచ్ఛ రాజమహేంద్రవరం సాధ్యమవుతుందనే విషయాన్ని నగరపాలక సంస్థ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తుపెట్టుకోవాలి. నగరంలో పారిశుధ్య చర్యలు సక్రమంగా జరగడం లేదు. కలుషితమైన గోదావరి నుంచి నీటిని తీసి, శుద్ధి చేసి ప్రజలకు అందజేస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పరిశీలనకు వచ్చే సమయానికైనా గోదావరిలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలి.

– శైలజ, గృహిణి

నిబంధనలు కఠినంగా మార్చాలి



ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఆ సమస్య పరిష్కారమవుతుంది. గోదావరిలో వ్యర్థాలు కలవకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీంతో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు గోదావరిలో పేరుకుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– సబ్బెళ్ల విజయదుర్గారెడ్డి

సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి



విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డిస్తున్న డీఎస్ఈవో వాసుదేవరావు

కంబాలచెరువు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేవలం 28 రోజులు మాత్రమే సమయం ఉందని, దీన్ని చక్కగా వినియోగించుకున్నవారే విజేతలుగా నిలుస్తారని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ జరిగిన అన్ని పరీక్షల్లో ఏయే అంశాల్లో మార్కులు తగ్గుతున్నాయో చూసుకుని, ఉపాధ్యాయులతో సందేహ నివృత్తి చేసుకుని నూరు శాతం మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు. ఈ 28 రోజులూ ఆటపాటలకు, సామాజిక మాధ్యమాల్లో చాటింగ్‌లకు స్వస్తి పలకాలన్నారు. నిరంతరం చదువుకే సమయాన్ని వెచ్చించాలని, అదే సమయంలో ఆరోగ్యంపై కూడా అత్యంత శ్రద్ధ చూపాలన్నారు. సెలవుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల విద్యార్థులకు బడిలో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు జి.అప్పారావు, కన్నమ దొర పాల్గొన్నారు.

గోదావరిలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు



గోదావరిలో వ్యర్థాలను తొలగించిన ఆదిత్య ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు

కంబాలచెరువు: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 74 మంది ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్‌కు చెందిన వలంటీర్లు ఆదివారం కోటిలింగాల రేవులో స్వచ్ఛభారత్, సేవ్ గోదావరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిలోని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి, చెత్తను తొలగించారు. అనంతరం జరిగిన రక్తదాన కార్యక్రమంలో 41వ వార్డుకు చెందిన టీడీపీ ఇన్‌చార్జి, టింబర్ మర్చంట్ నందివాడ దినేష్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ఎఫ్ఎస్ఎస్ సభ్యులు కె.సుధాకర్ పట్నాయక్ చందన రాజు, పీవీఎస్ కృష్ణారావు పాల్గొన్నారు. గోదావరి ఒడ్డును చెత్త తొలగింపు కార్యక్రమాన్ని శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, ఎంహెచ్ఓ వినూత్న, ఎం.అనిల్ సహకారంతో వలంటీర్లు విజయవంతం చేశారు. అనంతరం జేఎన్ రోడ్డులోని హ్యాపీ స్ట్రీట్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ, జేసీఐ రాజమండ్రి ఇన్ అసోసియేషన్, ధన్వంతరి బ్లడ్ బ్యాంకు సహకారంతో రోటరీ హాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు.

పునరుత్పాదక వనరులు వినియోగిద్దాం

- ఓఎన్‌జీసీ అసెట్ ఈడీ శాంతానుదాస్
- ఉత్సాహంగా వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్, ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ అనుకూల పరిశుభ్రమైన పునరుత్పాదక వనరులను వినియోగించుకుంటూ భావితరాలను కాపాడుకుందామని ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ శాంతానుదాస్ అన్నారు. హరిత, స్వచ్ఛమైన శక్తి ద్వారా పరిశుభ్రమైన పర్యావరణాన్ని సాధిద్దామనే అనే నినాదంతో ఆదివారం గెయిల్ కార్యాలయం నుంచి ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ కార్యాలయం వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శాంతానుదాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరుల వినియోగం పెరుగుతుండడంతో భవిష్యత్తులో వాటి కొరత తీవ్రంగా ఏర్పడే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వ ఇంధన వనరులశాఖ 2030 నాటికి 500 గెగావాట్ల పునరుత్పాదక ఇంధనాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా ఓఎన్జీసీ పది మెగా వాట్ల ఇంధన సామర్థ్యాన్ని పెంచుకుంటుందన్నారు. రాజమండ్రి ఎసెట్ పరిధిలోని తాటిపాకలో ఇప్పటికే సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నామన్నారు. పర్యావరణ అనుకూల ఇంధన వినియోగంలో భాగంగా పవన విద్యుత్తును కూడా వినియోగంలోకి త్వరలో తీసుకు వస్తున్నట్లు తెలిపారు. దీనిపై అవగాహన కల్పించేందుకు అసెట్ పరిధిలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీసి ఉద్యోగులు, ఎస్‌పీఎఫ్ సిబ్బంది, కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

వీరభద్రుని ఆలయానికి దారేది!

- పట్టిసీమకు వెళ్లే మార్గంపై స్పష్టత కరవు
- ఇంకా నిర్ధారణ కాని వైనం
- వంగలపూడి రేవు వద్ద నీటి ప్రవాహం
- రామచంద్రపురం నుంచి అనుకూలం



వంగలపూడి ర్యాంపు వద్ద గోదావరిలో నీటి ప్రవాహం

సీతానగరం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏలూరు జిల్లా పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దర్శనానికి మన జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివెళతారు. వీరి కోసం సీతానగరం మండలం వంగలపూడి, రామచంద్రపురం నుంచి గోదావరిలో దారి ఏర్పాటు చేస్తారు. అయితే శివరాత్రి సమీపిస్తున్నప్పటికీ ఇంకా దారి ఎటు అనేది నిర్ధారణ చేయలేదు. ఏటా వంగలపూడి ర్యాంపు నుంచి సుమారు లక్ష మంది, రామచంద్రపురం నుంచి 30 వేల మంది పట్టిసీమకు వెళుతుంటారని అంచనా.

వంగలపూడి నుంచి దారి లేదు

ఈ ఏడాది వంగలపూడి ర్యాంపు నుంచి దారి వేయడానికి పరిస్థితి అనుకూలంగా లేదు. ఈ ప్రదేశంలో గోదావరిలో నీరు ఎక్కువగా ఉంది. గతేడాది ఇక్కడ నీరు తక్కువగా ఉండడంతో వంగలపూడి ర్యాంపు నుంచి గోదావరిలో తూరలు వేసి, పైన ఇసుకతో కప్పి నడక మార్గం ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి పట్టిసీమ వీరభద్రుని ఆలయం ఆరు కిలోమీటర్లు ఉంటుంది. ఈసారి గోదావరిలో నీటి మట్టం ఎక్కువ ఉండటంతో గూటాల దగ్గరలోని లంక వద్ద మార్గం ఏర్పాటుకు పరిశీలిస్తున్నారు. అయితే దీని వల్ల ఆలయానికి దూరం పది కిలోమీటర్లు పెరుగుతుంది. ప్రతి ఏడాదీ భక్తుల నుంచి చార్జీలు వసూలు చేసి ట్రాక్టర్లపై ఆలయం వద్దకు తరలిస్తుంటారు.



రామచంద్రపురం వద్ద అనుకూలంగా ఉన్న మార్గం

కేవలం మూడు కిలోమీటర్లే..

పురుషోత్తపట్నం పంచాయతీ రామచంద్రపురం రేవు నుంచి భక్తుల తరలివెళ్లడానికి నడక మార్గం సిద్ధంగా ఉంది. ఇక్కడ గోదావరిలో నీరు లేదు. ఈ ఏడాది పాటిరేవు పడటంతో భక్తులు తరలివెళ్లడానికి అనువుగా ఉంది. ఇక్కడ నుంచి వీరభద్రుని ఆలయం కేవలం మూడు కిలోమీటర్ల దూరం ఉంటుంది.

అధికారుల నిర్ణయమేమిటో!

రెండు రేవుల నుంచి వీరభద్రుని ఆలయానికి దారెటు అనేది అధికారులు నిర్ణయించాల్సి ఉంది. వంగలపూడి ర్యాంపు నుంచి అయితే లక్షల రూపాయలు ఖర్చు చేయాలి. అలాగే సైకిళ్లు, మోటారు సైకిళ్లు, కార్ల స్టాండ్, ట్రాక్టర్లపై భక్తులను తరలించడానికి బహిరంగ వేలం పాట నిర్వహించడం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. గోదావరిలో నీరు ఉండటంతో వంగలపూడి ర్యాంపు నుంచి భక్తులకు నడక మార్గం లేకుంటే పంచాయతీకి ఆదాయం ఉండదు. రామచంద్రపురం నుంచి అయితే నిధుల ఖర్చు చేయాల్సి పనిలేదు.

వినాయకునికి ప్రత్యేక పూజలు



ఆలయంలో భజన చేస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీ నగర్‌లోని బృందావన కాలనీలో వెలసిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. నేతాజీ నగర్, బృందావన్ కాలనీ, కాశీకృష్ణ నగర్ మహిళా బృందాల భజనా కార్యక్రమం భక్తులను అలరించింది. అనంతరం స్వామివారికి ఆలయ అర్చకుడు కిషోర్ శర్మ పూజలు నిర్వహించారు.

రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక తొలగింపు



ధవళేశ్వరంలో రోడ్డుపై పేరుకుపోయిన ఇసుకను తొలగిస్తున్న బీజేపీ నాయకులు

ధవళేశ్వరం: ఇసుక రవాణా సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో లారీల నుంచి జారిపోయి రోడ్డుపై పేరుకుపోతోంది. దీని కారణంగా అటుగా వెళ్లే వాహన చోదకులు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాగే బ్యారేజీ సమీపంలోని కాటన్ విగ్రహం కూడలిలో రోడ్డుపై ఇసుక పేరుకుపోయింది. దాన్ని తొలగించాలని బీజేపీ నాయకులు చేసిన విజ్ఞప్తిని పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆదివారం ఒంటెద్దు స్వామి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, స్థానికులు శ్రమదానం చేసి రోడ్డుపై పేరుకుపోయిన ఇసుకను తొలగించారు.

అక్రమంగా ఆవుల తరలింపు

రాజమహేంద్రవరం రూరల్: అక్రమంగా 50 ఆవులను తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బొమ్మూరు ఎస్సై అంకారావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం రాత్రి దివాన్ చెరువు జీరోపాయింట్ వద్ద బొమ్మూరు ఎస్సై అంకారావు, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అటుగా వెళుతున్న వ్యాన్‌ను పరిశీలించగా, దానిలో 50 ఆవులు ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆవులను గోశాలకు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమనాథుని స్వర్ణ రథానికి పూజలు



ఊలపల్లికి చేరుకున్న సోమనాథుని రథం

బిక్కవోలు: సోమనాథుని స్వర్ణ దివ్య లింగ రథం ఆదివారం ఊలపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా రథానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మకుమారి కృష్ణవేణి మాట్లాడుతూ 2018 అక్టోబర్ 18వ తేదీన హిందూపురం సమీపంలోని గోరంట్ల గ్రామంలో రథయాత్ర ప్రారంభమైందన్నారు. అప్పటి నుంచి అనేక గ్రామాల్లో పర్యటిస్తూ ఊలపల్లి చేరినట్టు తెలిపారు. ఈ నెల 16, 17 తేదీల్లో బ్రహ్మకుమారిల ఆశ్రమానికి చేరుకుంటుందని, అనంతరం జి.మామిడాడ పరిసర గ్రామాల్లో యాత్ర కొనసాగుతుందన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందించి, నైతిక విలువలను తీసుకురావాలని లక్ష్యంతో ఈ యాత్ర జరుగుతోందన్నారు. కార్యక్రమంలోని మాజీ సర్పంచ్ గేదెల సత్యనారాయణ, గేదెల వీరబాబు, గురుస్వాములు రొంగల శ్రీనివాసరావు, నెక్కల హరిబాబు, బ్రహ్మకుమారి శాంతి, సంధ్య, శివ, కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్య మినీ	: కెప్టెన్ అమెరికా
సూర్య ప్యాలెస్	: పట్టుదల
స్వామి	: బ్రహ్మ ఆనందం
శివజ్యోతి	: తండేల్
అనుశ్రీ	: లైలా
రాజా	: తండేల్
ఊర్వశి	: కాంప్లికేటెడ్
మేనక	: నిదురించు జహాపన, తల
రంభ	: ఆరెంజ్
కుమారి	: కెప్టెన్ అమెరికా
అప్సర	: తండేల్
అశోక	: లైలా
నామవరం	
వీఎస్ మహల్	: తండేల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: తండేల్
కడియం	
వెంకటసూర్య	: లైలా

ఆకట్టుకున్న డాగ్ షో



డాగ్ షోలో ఆకట్టుకున్న వివిధ జాతుల శునకాలు

రాజమహేంద్రవరం సిటీ: గోదావరి కెన్నెల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జేఎన్ రోడ్డులోని మన్యం ఫణి గార్డెన్స్‌లో డాగ్ షో నిర్వహించారు. రెండు జిల్లాల నుంచి పలు స్వదేశీ, విదేశీ శునకాలను ఈ కార్యక్రమానికి యజమానులు తీసుకువచ్చారు. అలాగే వివిధ జాతుల పక్షులు, గుర్రాలు, పుంగనూరు ఆవులు సందడి చేశాయి. షోలో పాల్గొన్న డాగ్ యజమానులకు నిర్వాహకులు మెమెంటోలు అందజేశారు.